# జాతకం

పొటువల్లి వెంకట సత్యరామారావు

అప్పుడే భోజనం చేసి హాల్లోకి వచ్చింది మృణాళిని టిపాయ్ మీదున్న పాన్ బాక్సు లోంచి కొంచెం వక్కపొడి తీసి నోట్లో వేసుకొంది ప్రక్కనే ఉన్న కుర్చీలో చేరబడి టిపాయ్ మీదున్న నవల చేతుల్లోకి తీసికొంది

నవల అట్టపై ఉన్న బొమ్మ చాలా ఆకర్షణీయంగా ఉంది. ఒక అందమైన యువకుని బాహుబంధాల్లో మరింత అందమైన యువతి ఎంత చక్కగా చిత్రీకరించాడో ఆ చిత్రకారుడు పుస్తకం తెరచి మొదటి పేజీలో ఉన్న చిత్రకారుని పేరు చూసింది

అందమ్ – తనకు బాగా పరిచయమున్న పేరే అది అది అతని కుంచె పేరు కావచ్చు. బొమ్మల అందానికి తగ్గట్టుగానే ఉంటుంది అతని మారుపేరు కూడా దాదాపు అన్ని పత్రికల్లోనూ అతని కార్టూన్లు ప్రచురితమవుతూనే ఉంటాయి

'పోస్ట్" అన్న కేకకు ఆలోచనల్లోంచి తేరుకుందామె. వెంటనే లేచి పోస్ట్‌మేన్ అందించిన కవరు తీసికొని ఫ్రం అడ్రస్ ఉందేమోనని చూసింది ఏమీ లేదు. కవరు తండ్రికి అడ్రస్ చేసి ఉండటంతో భోజనం చేసి నిద్రపోతున్న తండ్రిని లేపి కవరందించింది

'ఎక్కణ్ణుంచమ్మా?" ఆతృతగా అడిగారు పరంధామయ్య గారు

'తెలీదు నాన్నా ఫ్రం అడ్రసు లేదు " జవాబిచ్చింది మృణాళిని

కవరు చింపి చదువసాగాడాయన

ఎక్కడ్నుంఛండి ఉత్తరం?" అడుగుతూ వచ్చింది మృణాళిని తల్లి కమలమ్మ గారు నన్ను కాస్త చదువ నిస్తావా అంటూ విసుక్కున్నారు పరంధామయ్య గారు చదవటం పూర్తి చేసి హుఁఅంటూ చిన్నగా నిట్టూర్చారు ఆయన "ఏమిటండివిశేషం?" అడిగింది కమలమ్మ గారు

"ఏముంది మామూలే! మొన్న అమ్మాయిని చూసి వెళ్ళిన బెజవాడ సంబంధం వారు వ్రాశారు జాతకాలు సరిపోలేదు మరో సంబంధం వెతుక్కోండంటూ!'

"ఏమిటో నండీ! అమ్మాయి వివాహం చేయగలమో లేదో" అని బెంగ పట్టుకుంది నాకు" బాధగా అంది కమలమ్మ గారు

"మనం మటుకు ఏం చేస్తామే? ఏదో మనం సంపాదించిన దానితో ఇంత కట్నంగా ఇస్తానికి కూడా తయారయ్యాం కదా! పెట్టుపోతల్లో కూడా లోపం ఏమి చెయ్య దల్చుకోలేదు. అయితే మాత్రమేం? వచ్చిన ప్రతీ సంబంధం ఝాతకాలు కలవక పోవటం వల్ల చెడిపోతుంటే మనం మాత్రం ఏం చెయ్యగలం చెప్పు?" అంటూ ఓదార్చారు పరంధామయ్య గారు

ప్రక్క గదిలో కూర్చుని ఉన్న మృణాళినికి వీళ్ళ మాటలు వినబడుతూనే ఉన్నాయి. మొన్న చూసి వెళ్ళిన బెజవాడ సంబంధం వాళ్ళు అమ్మాయి నచ్చింది, జాతకా లివ్వండి. ముహూర్తం పెట్టిస్తామంటూ జాతకాలు పట్టు కెళ్ళారు తరువాత ఇప్పుడిలా జాతకాలు కలువ లేదంటూ ఉత్తరం వ్రాశారు

ఏమిటి ఈ జాతకాల పిచ్చి పెళ్ళి కొడుకు అంతరిక్ష కేంద్రంలో జూనియర్ సైంటిస్ట్. మిగిలిన గ్రహాల్లోనూ భూమిలో లాగే రాళ్ళూ రప్పలూ ఉన్నాయని తెల్సిన వాడు ఆ గ్రహాలు మనుషుల్ని అదుపులో ఉంచుకొంటాయనే వాదనను ఎలా అంగికరించాడో? తన వాళ్ళకు అంతగా లేది పిచ్చి

తనకు సంబంధాలు చూస్తున్న కొత్తలో మాత్రం తన జాతకాన్ని ఒక పేరుమోసిన పండితునికి చూపించార్థు ఆయన ఏవేవో లెక్కలు వేసి చెప్పాడు. తనకు కుజదోషం ఉందని ఆ విషయం వింటూనే మ్రాన్పడిపోయారు తన తల్లిదండ్రులు. కారణం– జాతకశాస్త్రం ప్రకారం కుజదోషం ఉన్న పిల్లకు పెళ్ళి చేస్తే ఒక సంవత్సరం లోపుగానే వరునికి ప్రాణగండం సంభవిస్తుందట. లేదంటే అదే దోషం ఉన్న పెళ్ళి కొడుకు కావాలి. అలాంటిది



చూస్తూ చూస్తూ ఏ తల్లిదండ్రులు కోడలుగా ఆహ్వానిస్తారు? పెళ్ళి కాలేదనుకొని బాధ పడటం తనదే తప్పు. బాధగా ఆలోచిస్తూ కళ్ళు మూసుకొందామె.

★ ★ ★ ★

"ఏమేవ్, ఏర్పాట్లన్నీ అయ్యాయా? అమ్మాయిని తయారు చెయ్యటం అయ్యిందా? వాళ్ళు వచ్చే వేళయ్యింది!" గదిలోకి ప్రవేశిస్తూ అన్నారు పరంధామయ్య గారు.

"అమ్మాయి పెళ్ళి చూపులకు సిద్ధం కానంటోందండీ! ఎంత చెప్పినా వినటం లేదు" కోపంగా చెప్పింది కమలమ్మ గారు. దాంతో "ఏమిటమ్మా గొడవ" అంటూ మృణాళినిని అడిగారు పరంధామయ్య గారు.

"మళ్ళీ ఎందుకొచ్చిన తంతు నాన్నా ఇదంతా? ఎలాగూ వాళ్ళు చూసి వెళ్ళటం, తర్వాత జాతకాలు కలువ లేదంటూ ఉత్తరాలు వ్రాయడం మామూలేగా. పైగా ఇదంతా ఒక ఖర్చు కూడానూ!" విరక్తిగా అంది మృణాళిని.

"అలాగంటే ఎలాగమ్మా. మన ప్రయత్నం మనం చెయ్యాలిగా. అన్నట్లు నీకి విషయం చెప్పటం మర్చే పోయాను. పెళ్ళి వారడిగితే నీ పుట్టిన రోజు డిశంబరు 12 అని లేక 10 అని చెప్పమ్మా!"

తండ్రి మాటలు విని ఒక్క క్షణం ఆశ్చర్య పోయింది. అంతలో "అదేం నాన్నా?" అంటూ అడిగింది.

"మరేమీ అనుకోకమ్మా. నిన్ను చూట్టానికి వచ్చిన ప్రతివాళ్ళూ, నువ్వూ, మేమిచ్చే కట్నం అన్నీ నచ్చినా జాతకాల విషయంలో తిరిగి పోతున్నారు. జాతకం విషయంలో నీ కెలాగూ అట్టే నమ్మకం లేదని నాకు తెల్సు. అందుకే నీ జాతకాన్ని కొద్దిగా మార్చి రాయించాను. ఊ.... కానీ.... కానీ.... త్వరగా తెములు" అంటూ కంగారుగా వెళ్ళిపోయాడాయన.

తండ్రి మాటలు విని ఆలోచనల్లో పడిందామె. వాళ్ళని ఇలా మభ్యపరచి తన నిచ్చి వివాహం చేస్తే మోసం చేసినట్లు కాదా? ఒకవేళ తన జాతకం నిజమైతే? తరువాత ఏదన్నా జరిగితే తన మాట ఎలా ఉన్నా తనను చేసికొన్న పాపానికి అతనికి శిక్షపడుతూంటే తను భరించ గలదా?

ఆమె ఆలోచనలిలా సాగిపోతూండగానే ముందు గదిలో కలకలం విన్పించింది. వాళ్ళొచ్చి నట్లున్నారు. కిటికీ లోంచి చూసింది తనుఅతనికి కనపడకుండా తెర అడ్డంగా చేసికొని. అందగాడే అనుకొంది మనసులో. అయితే జాతకం విషయంలో మాత్రం తండ్రి చేసిన పని తన మనసుకు నచ్చటం లేదు. అలా చేసే వివాహం తన కక్కర లేదు. అసలా పెళ్ళి చూపులే మానివేద్దా మనుకొంది. కానీ వచ్చే వాళ్ళ ముందు బాగుండదని అభ్యంతరం తెల్ప లేదు.


"అమ్మాయిని తీసుకురండి!" మధ్యవర్తి మాటలు గట్టిగా విన్పించాయి.

అంతలో తల్లి వచ్చి "పదమ్మా!" అంటూ చేయి పుచ్చుకొంది. ముఖాన నవ్వు పులుముకొని ముందు గదిలోకి అడుగు పెట్టిందామె. మధ్యవర్తి పెండ్లి కొడుకును, అతని తల్లి దండ్రులనూ పరిచయం చేయటంతో వారికి నమస్కరించి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది. మామూలుగా ఉండే ప్రశ్నలతో ముగిసింది పెళ్ళి చూపుల తతంగం. ఏ సంగతి తర్వాత ఉత్తరం వ్రాస్తామని వెళ్ళిపోయారు వాళ్ళు.

★ ★ ★ ★

తర్వాత కొన్ని రోజులకి వచ్చింది వాళ్ళ






దగ్గర్నుంచి ఉత్తరం అమ్మాయి వచ్చిందనీ, అభ్యుదయ భావాలు కలవాడవ్వటంతో కట్న కానుకల ప్రసక్తి లేదనీ ఇష్టమైతే వచ్చి ముహూర్తాలు పెట్టు కెళ్ళమనీ సారాంశం. అది చూసి పరంధామయ్య, కమలమ్మగార్ల ముఖాలు ఆనందంతో వెలిగి పోయాయి ఒక బ్యాంకు ఆఫీసరు, యోగ్యుడు, కానీ కట్నం కోరకుండా తమకు అల్లుడు కాబో తున్నాడు

"చూశావుటమ్మాయ్ ఈ ఉత్తరం!" ఆనందంగా కూతుర్ని కేకవేసి ఉత్తరం చేతిలో ఉంచాడు పరంధామయ్య గారు. ఉత్తరం ఆసాంతం చదివింది మృణాళిని. "నాకీ పెళ్ళి యిష్టం లేదు నాన్నా!" అంది తండ్రితో.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కి పడ్డారు ఆమె తల్లిదండ్రులు. "అదేం అమ్మా! అతను నీకు నచ్చ లేదా?" ఆతృతగా అడిగారు పరంధామయ్య గారు. "అది కాదు నాన్నా జాతకం విషయంలో వాళ్ళకు అబద్ధం చెప్పి, మోసగించి, అతన్ని వివాహం చేసికోవటం నాకిష్టం లేదు "

ఆ మాటలు వింటూనే బిగ్గరగా నవ్వారు పరంధామయ్యగారు. "ఇందులో తప్పేమి లేదమ్మా. కాలం అడ్వాన్సు అయ్యింది. ఇంకా ఈ జాతకాలు అవి ఇవీ అంటూ కూర్చుంటే పనులు జరగవమ్మా. అయిందేదో అయిపోయింది. నూరు అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్ళి చేయమన్నారు ఈ ఒక అబద్ధం ఆడినందువల్ల వచ్చే నష్టం ఏమి లేదు అబ్బాయి కూడా జాతకం విషయంలో అంత నమ్మకం లేదని విన్నాను. చదువుకొన్న దానివి. మూర్ఖంగా ఆలోచించి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోకు" కోపంగా అనేసి ఆమె చెప్పేది వినిపించుకో కుండానే వెళ్ళిపోయా డాయన.

ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? నిజం వాళ్ళకు చెప్పి ఈ పెళ్ళి మాన్పించటమా? లేక తండ్రి చెప్పినట్టు తలుపు తట్టిన అదృష్టాన్ని త్రిప్పి పంపకుండా అతన్ని పెళ్ళి చేసికోవటమా? ఆమె ఇలా

## "జాతకం"

ఆలోచన్లతో సతమత మవుతూండగానే ఆమె ప్రమేయం ఏమీ లేకుండానే పెళ్ళి ప్రయత్నాలు జరగడం పెళ్ళి అయి అత్తవారింటికి రావటం కూడా జరిగి పోయాయి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల్ని బాధపెట్టటం ఇష్టంలేక, అన్నిటికీ మౌనంగానే సహకరించింది మృణాళిని.

మొదటి రాత్రే తెలుసుకొంది అతను చాలా మంచివాడని! ఏది ఏమైనా తాను చేసింది తప్పేనని మనసు పీకుతోంది. రెండవ రోజున ఆమె లేవటం కొంచెం ఆలస్య మయింది. లేవగానే వంటింట్లోకి వెళ్ళి చూస్తే అత్తగారు అప్పుడే కాఫీ చెయ్యటం ముగించింది. మృణాళినిని చూసి, "అబ్బాయి ముందు గదిలో ఉన్నాడు. ఈ కాఫీ ఇచ్చి రామ్మా!" అంటూ కప్పు చేతి కందించింది.

అది పుచ్చుకొని ముందు గదిలో అడుగుపెట్టిన ఆమెకు అక్కడి దృశ్యం ఆశ్చర్యాన్ని కల్గించింది ఆమె భర్త అటువైపు తిరిగి ఉన్నాడు అతని ముందు . ఒక స్టాండు దానికి అమర్చిన కాగితంపై ఒక అందమైన చిత్రం. ఇంకా తడారని ఆ చిత్రం లైటు కాంతిలో వింతగా మెరుస్తోంది అప్పుడే చిత్రం గియ్యటం ముగిసినట్లుంది. చిత్రం కింద ఒక మూలగా చిన్న చిన్న అక్షరాలతో సంతకం చేసున్నాడతను.

ఒక్క క్షణం ఆమె గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ప్రముఖ చిత్రకారుడు "అందమ్" తన భర్త. కాదు.... కాదు.... తన భర్తే ప్రముఖ చిత్రకారుడు. ఆ క్షణమే అతనిపై ఉన్న ప్రేమ రెట్టింపు అయ్యింది. తను చేసిన మోసం కూడా గుర్తొచ్చి ఏడుపు తన్ను కొచ్చింది. కళ్ళ నీళ్ళతోనే అతనికి కాఫీ అందించింది.

"ఏమయ్యింది మృణా?" ఆవేదనగా అడిగా డతను. ఏడుస్తూ అతని గుండెలపై ఒరిగి జరిగిందంతా చెప్పేసింది అంతా విని నవ్వేశాడతను

"ఓహ్! ఇంత మాత్రానికేనా ఏదో జరిగి పోయినట్లు బాధపడు తున్నావు ఒకవేళ జాతకాలు కలువ లేదంటూ మన పెళ్ళి ఆగిపోతే ఇంత అందమైన అమ్మాయి నాకు దొరికేదా?" అంటూ ఆమె బుగ్గలపై ముద్దు పెట్టుకున్నాడు "దీని గురించి నువ్వేం బెంగ పెట్టుకో నక్కర్లేదు అవన్నీ మర్చిపో ఇదిగో నే గీసిన కార్టూన్లు చూడు" అంటూ ఆమెకు ఇదివరలో తాను గీసిన కార్టూన్లు చూపించి నవ్వించా డతను

★ ★ ★ ★

కాలం ఇట్టే గడిచి పోయింది వాళ్ళ కిప్పుడు ఒక పిల్లవాడు. ఈ మూడేళ్ళలో మృణాళిని భర్తకు ప్రమోషన్ వచ్చింది అంతే కాకుండా అతను గీసిన చిత్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది చక్కనైన జీవితం ముచ్చటైన సంసారమే కాక సంఘంలో గౌరవం కూడా.

ఆ రోజు వాళ్ళ పెళ్ళయి మూడు సంవత్సరాలైన రోజు "మన పెళ్ళి రోజుకి ఏం కావాలో కోరుకో!" నాటక ఫక్కీలో అన్నాడు మృణాళిని భర్త

"ఏమీ అక్కర్లేదండీ! నాకు ఇంట్లో చాలా బోరుగా ఉంటోంది ఏదైనా సంఘ సేవలో పాల్గొనాలని ఉంది "

"అబ్బే! నీవేం సంఘసేవ చేస్తావు ఇంట్లో కూర్చుని సుఖపడ లేకనా?" అడిగాడు అతను.

అలా కాదండీ! మనం ఒక మేరేజ్ లింక్స్ స్థాపిద్దాం. నా పెళ్ళి జాతకాల దగ్గర, కట్నాల దగ్గరకు వచ్చేటప్పటికి వెనక్కి పోయేది. అలా కాకుండా జాతకాలు, కులాలు పట్టింపుల్లేకుండా కట్నంలేని పెళ్ళిళ్ళని మనం ముందుండి జరిపించి వారిని ప్రోత్సహిద్దామండీ. ప్లీజ్!"

"ఓ.కె. ఓ.కె అలాగే కానీ నా చిత్రాల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో సగం దానికై ఖర్చు చేద్దాం. ఇక టైమ్ వేస్ట్ చెయ్యకు" అంటూ ఆమెను దగ్గరకు తీసికొన్నాడు వాళ్ళిద్దరి మధ్యా మాటలు కరువయ్యాయి. ఆ తర్వాత రోజే, "మోడరన్ మారేజ్ లింక్స్" ఏర్పరచారు. అనతి కాలంలో నే దానికి మంచి ప్రోత్సాహం లభించింది □